# హద్దం

ఆశీర్వాదం వొట్టిసినిక్. వీరసినిక్. రాజకీయాల నుంచి ఎలిమెంటరీ స్కూళ్ళ దాకా సమాజ యంత్రాంగాలన్నీ కుళ్ళి కంపు కొడ్తున్నాయన్నది అతని మతం. అది అబద్దం కాకపోవచ్చు. కానీ మంచితనాన్ని ఎక్కడా లేశమైనా చూడలేకపోవటం అతని మనోరుగ్మత కాదా?

నాకు అలాంటి సినిక్స్ అంటే జాలి. వాళ్ళూ సమాజంలో భాగమే కదా?

ఆశీర్వాదం, సుల్తాన్, నేను స్నేహితులం. ఆశీర్వాదం మాజీ స్టేజీ నటుడు. నేను వర్ధమాన రచయితను. సుల్తాన్ మంచి శ్రోత, పాఠకుడు ముగ్గురం తలా వో డిపార్ట్‌మెంట్‌లో ప్రభుత్వ వుద్యోగాలు చేసు టున్నాం. శలవురోజు విధిగా మేం ముగ్గురం కలుస్తాం. మేం కలిస్తే హాట్‌హాట్ టాపిక్‌పై చర్చ తప్పదు. చర్చకు స్రష్ట సుల్తాన్. ప్ర వక్త ఆశీర్వాదం. ద్రష్టను నేను.

ఆ రోజు చర్చ న్యాయవ్యవస్థ పనిచేసే తీరుతెన్నులపైకి మళ్ళింది. "బూర్జువా కోర్టులు, బూర్జువా జడ్జీలు" అంటూ పడికట్టు పదాలతో తిట్టి పోసేడు ఆశీర్వాదం.

"ఊరికే తిట్టేంలాభం ? ఉదాహరణాత్మకంగా తిట్టరాదూ ?" కొత్త ప్రేరణ యిచ్చాడు సుల్తాన్. అలా వుడికిస్తే ఆశీర్వాదం కథలు చెప్తాడు. ఆ కథలన్నీ వాస్తవంగా జరిగినవని మమ్మల్ని నమ్మమంటాడు. చీమ తలకాయంత వాస్తవానికి కొండంత కల్పనను జోడించి కలగాపులగం చేసి డ్రమెటిక్‌గా చెప్పటం ఆశీర్వాదం టెక్నిక్కని మాకు తెల్సు.

"అయితే వినండి. న్యాయస్థానాల కథ" అంటూ ఆశీర్వాదం కథ చెప్పటం ఆరంభించబోతుండగా "వొక్క క్షణం ఆగండి" అంటూ అతని భార్య నైటింగేల్ టీ కప్పుల్తో వచ్చింది.

నైటింగేల్ భర్తకు పూర్తిగా వ్యతిరేక స్వభావం. శాంతం ఆమె సొత్తు. భగవద్భక్తి వుంది. చర్చికి ప్రార్థనలకు వెళ్తుంది. యింట్లో భగవద్గీత చదువుతుంది. హైందవ ఆచారాలను పాటిస్తుంది. మంచితప్ప చెడు ఆమెకు కన్పించదు.

టీ తాగేక కథ నారంభించాడు ఆశీర్వాదం. శ్రోతలం ముగ్గురయ్యాం.

* * *

అప్పుడు నేను హైదరాబాద్‌లో చిన్న వుద్యోగంతోపాటు నాటకాల సేవ కూడా వెలగబెడ్తుండేవాడిని. నా ఆధ్వర్యంలో నడుస్తున్న వో సంస్థ తరఫున నాటకం వేస్తున్నాం.

లకడీకాపూల్‌లోని వో ప్రెస్‌లో నాటకం తాలూకు ప్రవేశపత్రాలను అచ్చు కిచ్చాను. వారం రోజులుగా తిప్పి తిప్పి ఆ మధ్యాహ్నానికి ఖచ్చితంగా యిస్తానని చెప్పేడు ప్రెస్ యజమాని.

ఆ రోజు జీతాల రోజు. ప్రవేశపత్రాలని అమ్మే నిమిత్తం ప్రవేశ పత్రాలను వివిధ ఆఫీసుల్లో వున్న మిత్రులకు అందజేయాలి. అలాగపుతేనే వాళ్ళు ఆ పత్రాలను అంటగట్టి సొమ్ము చేయగలరు. ఆరోజు దాటితే

ఖాతాల్లోకి దిగుతుందిబేరం. నాటక ప్రదర్శన ఆ నెల పదిన. మళ్ళీ జీతాల రోజుకు నాటకాన్ని గురించి అంతా మర్చిపోతారు. నాటకాలు వేసే నిమిత్తం ధనసేకరణలో మేము అవలంబించే పద్ధతుల్లో యీ "అంటకట్టుడు విధానం" ముఖ్యమైనది.

పన్నెండు గంటలకు యింకా కొన్ని నిముషాలుండగానే ఆఫీసు నుంచి చెక్కేశాను. ఆఫీసు యంత్రాంగం ఎప్పుడో తగలబడిపోయింది కనుక ఎప్పుడు వెళ్ళినా నన్ను అడిగేవాడే వుండడు. వున్నా నేను కేర్ చేయను. మా ఆఫీస్ కూడా లకడీకాపూల్ లోనే వుంది.

నేను వెళ్ళీ వెళ్ళగానే పేక్‌చేసి వుంచిన కట్టల్ని యిచ్చాడు ప్రెస్ యజమాని. సైకిల్ మీద ఆఫీసులకెళ్ళి ఆ పత్రాలను డిస్ట్రిబ్యూట్ చేసి తిరిగొచ్చి మా ఆఫీసులో అంటగట్టుడు ఆరంభించాలి. పన్నెండు దాటి పావుగంట అవుతోంది. వ్యవధి లేదు. సైకిలెక్కి డౌన్‌లో ఝూమ్మని తొక్కుతున్నాను.

లకడీకాపూల్ సెంటర్‌కు కాస్త ఎగువన తెల్లబట్టలు వేసుకొన్న వో ట్రాఫిక్ కానిస్టేబుల్ రోడ్డుకు అడ్డంగా నిలబడి నన్ను ఆపాడు.

"సైకిల్ అక్కడ పెట్టు" అన్నాడు హేండిల్ పట్టుకొని పక్కకు లాక్కెళ్తూ ఉర్దూలో.

కానిస్టేబుల్ నల్లగా ధృఢంగా వున్నాడు. నలుపు తెలుపు వెంట్రుకలు కల్సివున్న పిల్లి గడ్డాన్ని నీట్‌గా కట్ చేశాడు.

"ఎందుకు?" అన్నాను తెలుగులో.

నల్లపోలీసు కళ్ళు ఎర్రనయ్యాయి. ఉర్దూలో కారణం చెప్తూ వేలుని వొకవైపు పాయింట్ చేశాడు. అప్పటికే పట్టుకొన్న సైకిళ్ళు అక్కడ చాలా వున్నాయి. ఉర్దూ అర్థం కాకపోయినా నాకు విషయం అర్థమయింది.

ట్రాఫిక్ రూల్స్ ప్రకారం పాదచారులు రోడ్డుమీద నడవరాదు. పేవ్‌మెంట్‌మీదే నడవాలి. రెండు చక్రాల వాహనాల వారు రోడ్డువారగా వో లైన్ పరిధిలో వెళ్ళాలి. నాలుగు చక్రాల వాహనాల వారు రోడ్డు మధ్యలో దర్జాగా వెళ్ళొచ్చు. డబ్బున్నవాళ్ళ ప్రివిలేజ్ కాబోలునది !

రెండు చక్రాల మీద వెళ్తున్న నేను నా హద్దుదాటి నాలుగు చక్రాల వారి సరిహద్దులోకి చొచ్చుకు పోయానుట. అదీ నా నేరం.

అమావాస్యకూ పౌర్ణమికీ పోలీసులకి రూల్సు హటాత్తుగా గుర్తు కొస్తాయి. మెరుపుదాడులు చేసి యిలా జనాన్ని యిబ్బందులు పెడ్తుంటారు.

అసలే గంధకం వంటి మనిషిని నేను. సూరేకారం తోడయింది. త్వరగా వెళ్ళాల్సిన పనిలో వుంటే అడ్డగించటం పొటాస్‌లా పనిచేసింది. మరి నా వొళ్ళు మండిందంటే మండదు ? పోలీసుల జులుంని ఎదుర్కొన్నాను.

"ముందు సైకిల్ వదులు" అన్నాను కోపంగా. కానిస్టేబుల్ వదలేదు సరికదా విసురుగా ముందుకు లాగాడు దాన్ని. అతనికి తెలుగు రాదు. హైదరాబాద్ ముస్లిమ్.

"వదలమంటుంటే ?" అతని చెయ్యిని విదిలించికొట్టి సైకిలు లాక్కొన్నాను. అప్పటికి పదిమందీ మూచుట్టూ చేరారు.

"అదిగో రోడ్డు మీద నడుస్తున్నారు వాళ్ళెవరో. పేవ్‌మెంట్‌మీద నడవడం లేదని కేసు పెట్టవేం ? ఆ కారు బాబెవడో వాటి సరిహద్దు దాటి యివతలకొచ్చాడు. వాడిని పట్టుకోవేం ? అసలు రోడ్డుమీద లైన్‌మార్జిన్స్ స్పష్టంగా కన్పిస్తున్నాయా ? త్రేతాయుగంనాడు వేసినవి. మార్జిన్స్ కన్పిస్తూ వుంటేకదా దాటానని కేస్ పెట్టడానికి ? నేను రోడ్డు మార్జిన్ దాటానన టానికి నీ దగ్గరున్న ఆధారాలేమిటో చెప్పు ముందు ?"

నా వాదానికి నల్ల పోలీసు శరీరమంతా ఎర్రనయింది. మరో పోలీసుకు ఏమో చెప్పాడు ఉర్దూలో. అతడు నా చెయ్యి పట్టుకొన్నాడు. "అవన్నీ రేపు కోర్టులో చెప్పుకో. పో." అంటూ నా నుంచి బలాత్కారంగా సైకిలు లాక్కొన్నాడు నల్ల పోలీసు. జనంలో ఎవరో నన్ను పట్టుకొని శాంతపర్చారు.

*　　*　　*

కాస్సేపాగి మళ్ళీ ఆశీర్వాదం కథ కొనసాగించాడు. అతను కథ ఆపినప్పుడు మేమేం మాట్లాడలేదు.

పెట్టే కేసుల్ని విచారించే మేజిస్ట్రేట్ కోర్టుల్లో వేదగిరి కోర్టు కోర్టు పక్షులకి ప్రసిద్ధం. అంతకుముందే యిలాంటి అనుభవాలున్నవారు అతడిని గురించి కథలు చెప్పుకొని నవ్వుకొంటున్నారు.

"డబుల్ రైడింగ్ చేసేవా ?" అని అడుగుతాడు వేదగిరి.

చేసేను అన్నట్లు తల వూపితే రూపాయో. రెండో ఫైన్ అంటాడు.

"చేసేను" అని నోటితో చెప్తే రెండింతలు ఫైన్ వేస్తాడు.

"బీదవాడిని దయ చూడండయ్యా మహాప్రభువులు" అంటూ మాట్లాడితే మూడింతలు ఫైన్.

"చేయలేదు" అని పొరపాటున ఎవరైనా అంటే వేదగిరి ఫైర్ అయిపోతాడు. నోటికెంత తోస్తే అంతే ఫైన్. ఎవరిచేతనైనా రెకమెండేషన్ గట్రా చేయిస్తే యిక వాడికేసే చూడడు. కోర్టుకు రావటం.... పోవటం.... ! ముద్దాయిలకి, ప్లీడర్లకి, పోలీసులకి అందరికీ బెర్రరే అతనంటే.

"పెట్టీ బూర్జువా తత్వం.... సేడిస్టు మూఢుడు" అనుకొన్నా న్నేను.

కానీ నా కప్పుడు వేదగిరి కారెక్టరును గురించి విశ్లేషించే టైమ్ లేదు. అవతల ఆఫీసులో పని....నాటకాల పని....

ఒంటిగంట కావస్తుండగా సైకిల్ కేసుల్ని పిలవసాగేడు వేదగిరి. ఒకటి....రెండు.... ఆరోజు ఫైను అంతకన్నా మించలేదు.

అందరూ అయ్యాక ఆఖరి ఛాన్సు నా కొచ్చింది.

"రోడ్డు మార్జిన్ సరిహద్దు దాటి సైకిల్ తొక్కేవా ?"

అందరిలాగా తలవూపేను నేను.

"రెండు రూపాయలు" అనలేదు జడ్జి.

తన ముందరవున్న కాగితాలు చూస్తూ కనుబొమలు ముడివేసేడు.

"నువ్వేంచేస్తుంటావ్ ? ఏం చదివేవు ?"

చెప్పేను.

"ఓ ! డిగ్రీహోల్డరువా ? అదేనా గర్వకారణం ? లేక గుమాస్తా వుద్యోగం ముందు పోలీసు వాడెంతలే అన్న చులకనా ? పబ్లిక్ డ్యూటీ చేస్తున్న వుద్యోగులపై దౌర్జన్యం చేస్తావ్ ? పోట్లాడటానికి పాపం నీకు బీదపోలీసులు తప్ప దొరకలేదన్నమాట !"

నాకు మతి పోయింది. నోట మాట రాలేదు.

"మౌనం నేరాన్ని అంగీకరించినట్లేనా, నీ వేషాలు నా దగ్గరకాదు. పోలీసుల దగ్గర రూల్స్ మాట్లాడేవ్ కదా ? ఆ ప్రశ్నలు వెయ్యి మళ్ళీ."

మాట్లాడితే వొకచిక్కు. మాట్లాడకపోతే మరో చిక్కు.

"అది కాదు సార్...."

"ఓహో ! తప్పు చేయలేదనీ డిఫెండ్ చేసుకొంటావన్నమాట.

సరే మళ్ళీ శుక్రవారం రా. యీలోగా జామీన్‌మీద వదిలేస్తున్నా. రెండొం దల రూపాయల బాండ్ మీద సంతకం పెట్టి వెళ్ళు."

వేదగిరి ఆర్డర్ జారీ చేసి న్యాయపీఠం నుంచి లేచి ఛాంబర్‌లోకి వెళ్ళిపోయాడు.

నా కాళ్ళు చేతులు చల్లబడ్డాయి. ఆ క్షణంలో ?

* * *

"పోలీసులతో పోరాడినప్పటి నీ శక్తి న్యాయస్థానంలో ఎక్కడికి పోయింది ?" సుల్తాన్ ప్రశ్నించాడు.

"అదే చెప్పబోతున్నా........" అంటూ మళ్ళీ సాగించాడు ఆశీర్వాదం.

* * *

రోడ్డు హద్దు నతిక్రమించానని కేసు పెట్టి ఊరుకోలేదు నల్ల పోలీసు. తన విధి నిర్వహణకు దౌర్జన్యంగా ఆటంక పరిచానని కూడా కేసు బనాయించాడు. పబ్లిక్ సర్వెంట్ విధి నిర్వహణను అబ్‌స్ట్రక్ట్ చేయటం పెద్ద నేరం. క్రిమినల్ కేసు కిందికొస్తుంది. కేసు ప్రూవ్ అయి ఎలాంటి శిక్ష పడ్డా నా వుద్యోగానికి ఎసరు వస్తుందని నాకు తెల్సు.

నాకీ బూర్జువా ఉద్యోగమంటే మొదటినుంచీ అసహ్యమే. అయితే నేను పేదవాడిని, కొత్తగా పెళ్ళయింది. భార్యతోపాటు నామీద ఆధారపడ్డ తల్లిదండ్రులు సోదరు లున్నారు. యీవ్యవస్థలో నాలాంటివాడికి గుమాస్తా ఉద్యోగం రావటమే గొప్ప. మరి దాన్ని చేతులారా పోగొట్టుకుంటే బ్రతకటం ఎలా ? పైగా యింత పేరు తెచ్చుకొని యో క్రిమినల్ కేసులో శిక్ష పొందటమా ? ఎంత నామర్దా ?

నాటకరంగ సంబంధంగా నాకు పెద్ద సర్కిల్ వుండే దా రోజుల్లో. బూర్జువా వ్యవస్థలో ధనంవల్ల, రికమెండేషన్లవల్ల కాని పనులేముంటాయి? ఎలాగైనా కేసు మాఫీ చేయించుకోవాలని ప్రయత్నించాను. ముందు నల్ల పోలీసును కలిసేను. అతను మంచిగానే మాట్లాడేడు. కానీ కేసు పెట్టేక యిపుడు తనేం చేయలేనన్నాడు. వేదగిరిని గురించి చెప్పేడు.

వేదగిరికే రెకమెండేషన్ చేయిస్తే?

"వేదగిరా? చెప్పమంటే చెప్తాను. కానీ అతనో తిక్కమనిషి. రెకమెండేషన్ చేయించేవని అఫెండ్ అయి ఏకంగా ఆరు నెలల జైలు శిక్ష వేసినా వెయ్యగలడు ఆలోచించుకో" అధికారులు, అడ్వొకేట్లు అందరిదీ వొకటే మాట. హైకోర్టులో పనిచేసే వారి నడిగాను. ఎవరూ ధైర్యం చెప్పలేకపోయారు.

యిలోగా కొందరు ప్లీడర్లు నాతరఫున వాదిస్తామని తయారయ్యారు వాదనలు....శిక్షలు....అప్పీళ్ళు....పులి నోట్లో తల పెట్టినట్లేగదా? తల్చుకుంటేనే భయం.... నిద్రలేదు. అన్నం సహించలేదు. నాటక ప్రదర్శన రోజు దగ్గర పడ్తోంది. వర్రీ....వర్రీ.... మోర్‌వర్రీ....

అప్పుడు కాకతాళీయంగా సత్యమూర్తిని కలవటం తటస్థించింది.

*　　　*　　　*

సత్యమూర్తి నా కోర్టు కథంతా విని నవ్వేడు.

"వేదగిరి కోర్టే కదా? మీకేం భయంలేదు" అంటూ నాకు అభయమిచ్చాడు.

సత్యమూర్తి వో సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసులో సెక్షన్ హెడ్. నా అభిమాని. అతను నన్ను హైకోర్టుకు తీసుకెళ్ళి వొక వృద్ధునికి పరిచయం చేసేడు.

"వీరు రవూఫ్‌ఖాన్‌సాబ్. వేదగిరిగారి ఫ్రెండ్."

ఖాన్‌సాబ్ హైకోర్టులో ప్యూన్స్, అటెండర్స్, మీనియల్ స్టాఫ్ లాంటి వారందరికీ హెడ్. వారి పై అధికారి. ఇంగ్లీషు, తెలుగు రాదు. ఉర్దూలో తప్ప మాట్లాడలేడు. అయితే ఆయన ఇంగ్లీషును, నేను ఉర్దూను కాస్త కాస్త అర్థం చేసుకోగలం.

టీ, పాన్‌బీడా తెప్పించి ఆతిథ్యం యిచ్చాడు మాకు ఖాన్‌సాబ్. మధ్యమధ్య అల్లా నామాన్ని స్మరిస్తూనే వున్నాడు. కానీ నా కేసు విషయం ఎంతకీ మాట్లాడడు. నా గుండెలో దడ పుట్టుకొచ్చింది. యితనివల్ల కూడా పని కాకపోతే నా పని "గోవిందా"నే కదా?

ఉన్నట్లుండి ఖాన్‌సాబ్ కుర్చీలో నుంచి లేచాడు. మేమూ లేచాము. మమ్మల్ని కూర్చోమని చెప్పి, తను పది నిముషాల్లో వస్తానంటూ ఎటో వెళ్ళేడు.

పది నిముషాలు....పావుగంట....అరగంట....గంట....సస్పెన్స్!

సత్యమూర్తి ధైర్యం నా ఆందోళనను తగ్గించలేక పోయింది.

అసలు ఖాన్‌సాబ్ వల్ల యీపని అవుతుందా? వేదగిరి మీద అతని రెకమెండేషన్ ఎలా పని చేస్తుంది? బెడిసికొట్టితే? అసలు ఆయనగారు ఎక్కడికి వెళ్ళినట్లు?

డొక్కుకారులో నుంచి దిగుతున్న రవూఫ్‌ఖాన్ కళ్ళ బడిందాకా యివే ఆలోచనలు. ఆలోచించే కొద్దీ ఆందోళన భయం....బీపీ...

"వేదగిరితో మాట్లాడొచ్చాను. రేపేగదా మీ కేస్ వాయిదా. ఏం భయం అక్కర్లేదు. రేపు కోర్టుకు వెళ్ళేముందు యిక్కడికి వచ్చి నన్ను కల్సుకొనిపొండి. నేను రావటం ఎంత ఆలస్యమయినా నన్ను కల్సుకోకుండా పోవద్దు. రేపు వచ్చినప్పుడు మిగతా విషయాలు చెప్తాను."

మర్నాడు పదింటికే ఆయన గదివద్ద నిరీక్షించసాగాను. రాత్రంతా నిద్రలేదు.

పదిన్నరయింది. పదకొండయింది. ఖాన్‌సాబ్ జాడ లేదు.

కోర్టులో నన్ను పిలిస్తే ? నేను లేకపోవడం మరో నేరం అవుతుంది. తనని కల్సి కాని వెళ్ళవద్దని ఖాన్‌సాబ్‌గారి ఆదేశం.

ఆయన ఆదేశం పాటించి యిక్కడే నిరీక్షించడమా? లేక ఏదవుతే అదవుతుందని కోర్టుకు వెళ్ళటమా ?

అసలు రవూఫ్‌ఖాన్‌గారు నా కేసు విషయం మర్చిపోయారేమో ?

పన్నెండవుతోంది. నా కాళ్ల చల్లబడ సాగాయి.

అప్పుడు చంద్రోదయ మయింది. ఖాన్‌సాబ్ డొక్కుకారు దిగారు.

* * *

"ఆ తర్వాత కథ ఏమయి వుంటుందో మీరు ఊహించి చెప్పండి" అంటూ కథను ఆపాడు ఆశీర్వాదం.

"ఏముంది ? ఖాన్‌సాబ్‌తో కల్సి మువ్వు కోర్టు కెళ్ళేసరికి అంతా అయిపోయి వుంటుంది. శిక్ష పడుంటుంది."

"శిక్ష పడి వుంటే యీయనగారింకా ప్రభుత్వోద్యోగం చేస్తుండేవారా ?" నైటింగేల్ అంది.

నా వైపు చూచాడు ఆశీర్వాదం. నేను మాట్లాడలేదు.

"నాకు శిక్ష పడిందా లేదా అన్నది కాదు సమస్య. కోర్టు కేసు కథ ఎలాంటి మలుపు తిరిగిందన్నది అసలు విషయం" అంటూ మళ్ళీ మెల్లిగా ఆరంభించాడు ఆశీర్వాదం.

* * *

ఖాన్ సాబ్ గారి ఆదేశానుసారం కోర్టు హాల్ గేటు వద్ద నిలబడి వేదగిరి కంట్లో పడ్డాను. లంచ్ విరామమప్పుడు జడ్జిగారి ఛేంబర్ బయట కాసేపు అటూ యిటూ తారట్లాడేను.

కాసేపయ్యాక కోర్టు ప్యూను నా దగ్గరకొచ్చి నా పేరు తెలుసుకున్నాడు.

"బ్రతుకు జీవుడా" అనుకొన్నాను. ఎందుకంటే నా కేసును అంత వరకు పిలువలేదు.

కోర్టు ఆవరణలో తిరుగుతుంటే చెట్టుక్రింద కనిపించాడు నల్ల పోలీసు.

"యిప్పుడా రావటం ? నీ అదృష్టం బావుండి కేసు పిలవలేదు. కాబట్టి సరిపోయింది. లేకపోతే యింకేవన్నా వుందా? యిది వేదగిరి కోర్టు. మర్చిపోయావా ? మందలించినట్లు అన్నాడు నల్ల పోలీసు.

కోర్టు తిరిగి సమావేశమయింది. నేను నల్ల పోలీసు ద్వారానికి చెరో వైపు ద్వారపాలకుల్లా నిలబడ్డాము. కానీ ఏవేవో కేసులు పిలుస్తున్నాడే కాని జడ్జిగారు మా కేసు పిలిస్తేనా ?

"మీ కేసులు కానప్పుడు గుమ్మం ముందు జండా కొయ్యల్లా ఎందుకయ్యా నిలబడ్తారలా. అయ్యగారు కోప్పడ్తారు. మీరలా వెళ్ళి కూర్చోండి. మీ కేసు వచ్చినప్పుడు పిలుస్తానుగా ?"

కోర్టు ప్యూను రెండు మూడు సార్లు అలా కసురుకున్నాక నల్ల పోలీసు దూరంగా చెట్టు కిందికి వెళ్ళిపోయాడు. నేను మాత్రం ఖాన్ సాబ్ గారి ఆదేశానుసారం గుమ్మాన్ని వదల్లేదు.

అలా పది నిముషాలయ్యాక ఓ చిత్రం జరిగింది.

ఉన్నట్లుండి ప్యూను నా కేసు పిలిచాడు. నేను వెళ్ళి బోను వద్ద నిలబడ్డాను. కానీ కేసు పెట్టిన నల్లపోలీసు ? అతను రాలేదని చిరాకు పడ సాగాడు జడ్జిగారు.

ఈలోగా ఎవరి ద్వారానో కేసు పిలిచిన కబురు అందుకొని నురుగులు కక్కుకుంటూ వచ్చి కోర్టువారి ముందు నిలబడ్డాడు నల్లపోలీసు.

"ఏమయ్యా యింత ఆలస్యం ? కనిపించిన వాడిపై నల్లా కేసు పెట్టడమేకానీ, కోర్టువారు పిలవంగానే కోర్టులో హాజరుకావాలని తెలియదా మీ పోలీసులకి? కోర్టు కొచ్చించి కబుర్లు చెప్పుకోటానికా? కేసు హాజరు కావటానికా ? నిన్ను ఎవరో ఏదో చేశారని రాయగానే, నీ మాట మీద నేను వాళ్ళకు శిక్షలు వేయాలనే నీ అభిప్రాయం ?" గద్దించాడు వేదగిరి.

నల్లపోలీసుకు ముచ్చెమటలు పోసాయి.

"అది కాదు సార్, విన్పించలేదు. యింత వరకు యిక్కడే...."

"విన్పించలేదూ ? అంటే నేరం కోర్టు వారిదేనంటావు ? అంతేనా? అలాగని స్టేట్‌మెంట్ రాసి సంతకం పెట్టు. పోలీసుల్ని పిలవటానికి మైకులు అరేంజ్ చెయ్యవల్సిందని పై వాళ్ళకు రాస్తాను. బాధ్యత గల పోలీసు వుద్యోగం చేస్తున్నావ్, కోర్టును గౌరవించాలని కూడా తెలీదన్నమాట ! పైగా నిన్నెవరో ఏదో చేశారని అభియోగాలు. కేసులు పెట్టడానికి నేరాలు దొరకనప్పుడల్లా అమాయకులైన కుర్రాళ్ళ మీద ఏదో కేసు బనాయించటమేనన్నమాట నీ పని ! నీ ఖాకీ డ్రెస్ మహత్యమయ్యా అది." జడ్జిగారు అలా ఎడాపెడా వాయించేశాడు నల్లపోలీసును. నల్లపోలీసుకు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. దీనంగా ఏమేమో వుర్దూలో చెప్పుకున్నాడు.

"సరే పో. యీసారికి నిన్ను క్షమించి వదిలేస్తున్నా. నువ్వు పెట్టిన కేసును కొట్టేస్తున్నా. కాని మళ్ళీ ఎప్పుడూ యిలాంటి పనులు చెయ్యకు."

విజయగర్వంతో కోర్టు బయట కొచ్చిన నాకు నల్లపోలీసు మేక పిల్లలా సెల్యూట్ చేశాడు.

* * *

యిదీ న్యాయస్థానాల కథ. బూర్జువా వ్యవస్థలో న్యాయాన్ని ఎలా తలక్రిందులు చేయవచ్చునో చెప్పేకథ" అంటూ ఆగి మావైపు చూచాడు ఆశీర్వాదం. సుల్తాన్‌కు కథ నచ్చింది. నైటింగేల్ అతనితో వాదిస్తోంది.

కథ బాగోగులకన్నా ఆశీర్వాదం కామెంట్స్ అతను ఉపయోగించిన పదాలు నాకు అసహ్యంగా కన్పించాయి. బూర్జువా వ్యవస్థ చిత్రీకరణ అంటూ కథలోవుంటే అందుకు కేంద్రస్థానం కథలోని ఆశీర్వాదం పాత్రే. అలాగే వేదగిరి అన్న వో వ్యక్తి న్యాయవ్యవస్థ నంతటికీ ఎలా ప్రాతి నిధ్యం వహించగలడో నాకర్థం కాలేదు. యీ విషయాలు ఆశీర్వాదంతో వాదించి లాభంలేదు. ఎందుకంటే అతనికి తను వాడే కొన్ని పదాలకి అర్థంకూడా తెలియదు.

అంచేత లేచాను మాట్లాడకుండా.

"ఏమిటోయ్ లేచావ్ ? నీకు కథ నచ్చలేదుకదూ ? బూర్జువా రైటరివి నువ్వు. యీ వ్యవస్థ కొమ్ముకాచే మనిషివి. నీకెలా నచ్చుతుందిలే."

ఆశీర్వాదం అలా నన్ను అనవసరంగా కదిలించాడు. యిక అప్పుడు ఉదాసీనత వహించటం నా దృష్టిలో మంచితనం అనిపించుకోదు. చేతకానితనానికి అది నిదర్శనం. హద్దు మీరిన వాడిని దండించటమే న్యాయంకదా?

"ఆశీర్వాదం తొర్రివో మొర్రివో నీ కథకు కాళ్ళున్నాయ్, కానీ నీకు బుర్రే లేదు బొత్తిగా. నీ కథ నిజమే అయితే అందులో వ్యవస్థ దోషం ఏమిటి ? తప్పుచేసి దాన్ని లీగలైజ్ చేసుకోటానికి ప్రయత్నించే

నీలాంటి వక్రబుద్ధులదే తప్పంతా. అంచేత నీ కథలో పెద్ద బూర్జువా విలన్వి నువ్వే. హీరో నని భ్రమిస్తే జీవితంలో ఎప్పుడో మోసపోతావ్. నీలాంటి వక్రబుద్ధులు, వేదగిరి లాంటి మానసిక రోగులు వున్న సమాజంలో యిలాంటి కథలు జరుగుతూనే వుంటాయి. మీ బుద్ధి జాడ్యాలు, మనోరోగాలు ముందు కుదిరిస్తే కాని సమాజం ఆరోగ్యప్రదం కాదు. వ్యవస్థ మారదు" ఘాటుగానే దులిపాను.

ఆశీర్వాదం మొహం వెలిసిపోయిన జెండాలా అయింది. సుల్తాన్ నా విమర్శలో చురుక్కు విస్తుపోయాడు.

"నిజమే అన్నయ్యగారూ, సమాజం సంగతలా వుంచండి. కానీ యీ మన ధోరణి మరీ హద్దుమీరుతోంది. యిలాగ వుంటే మా కుటుంబ ఆరోగ్యమే చెడిపోతుందేమోనన్న భయంగా వుంది నాకు."

"నైటింగేల్ !" విభ్రమంతో అన్నాడు ఆశీర్వాదం.

("జాగృతి" వారపత్రిక 1983 దీపావళి ప్రత్యేక సంచిక)

కథముగింపు పాత్రల డైలాగులు 'జాగృతి' రచయిత
చేర్చిన ఉన్నాయి కాబట్టి ఆశీర్వాదం కేసు కాంచిన
తెగిపోయింది. రాసింది కేశవరావే ఆశీర్వాదం తిర్యగ్మెంటు
తెలుసుకోలేదు. కేశవ 21.11.92